నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, సోమవారం 10 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

నగరంలోని పరీక్షా కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రశాంతం

- ఖమ్మంలో 75.28 శాతం, భద్రాద్రిలో 74.95 శాతం హాజరు
- హైదరాబాద్ నుంచి వచ్చిన టీజీపీఎస్సీ అబ్జర్వర్ల పర్యవేక్షణ
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఖమ్మం కలెక్టర్, భద్రాద్రి ఎస్పీ
- సెంటర్ల పరిసర ప్రాంతాల్లో పటిష్ఠ భద్రత.. 144 సెక్షన్ అమలు..

కొత్తగూడెం: సింగరేణి కళాశాల పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

ఖమ్మం కవితా మెమోరియల్ కళాశాల వద్ద క్యూ..

భద్రాద్రి ఎస్పీని తనిఖీ చేస్తున్న పరీక్షల సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం/ కొత్తగూడెం క్రైం, జూన్ 9: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మంలో 75.28 శాతం, భద్రాద్రిలో 74.95 శాతం హాజరు నమోదైంది. ఖమ్మం జిల్లాలో మొత్త 52 పరీక్ష కేంద్రాల్లో 18,403 మంది అభ్యర్థులకు గాను 13,855 మంది హాజరయ్యారు. భద్రాద్రి జిల్లాలో 8,875 మంది అభ్యర్థులకుగాను 6,649 మంది మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చి సమయం మించిపోవడంతో వెనుదిరిగిన అభ్యర్థులు కూడా ఎక్కుమందే ఉన్నారు. ఖమ్మంలోని పరీక్ష కేంద్రాలను ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి జిల్లాలోని పరీక్ష కేంద్రాలను భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన టీజీపీఎస్సీ అబ్జర్వర్లు కూడా పరీక్షలను పర్యవేక్షించారు. ఎగ్జామ్ సెంటర్ల పరిసర ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు.

ఖమ్మంలో 4,548 మంది గైర్హాజరు..

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. పరీక్ష జరుగుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆర్‌జేసీ కళాశాల, క్రియేటివ్ హైస్కూల్, మౌంట్ ఫోర్ట్ హైస్కూల్, సెయింట్ జోసఫ్ హైస్కూల్, కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్, హార్వెస్ట్ హైస్కూల్, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లోని ఎగ్జామ్ సెంటర్లను తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలను ఆయా సెంటర్ల బయోమెట్రిక్ హాజరు వివరాల ద్వారా తెలుసుకున్నారు. అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసే విధంగా చర్యలు తీసుకోవాలని, సమయం తెలిసే విధంగా ప్రతి అరగంట సమయానికి బెల్ మోగించాలని, చివరి 30 నిమిషాలు ఉన్నప్పుడు అలారం బెల్ మోగించాలని సూచించారు. 4,548 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్ష ముగిసిన పరీక్ష అనంతరం కలెక్టరేట్ రిసెప్షన్ సెంటర్‌లో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో విజయ, ఎస్‌బీ ఐటీ ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ జాన్‌బాబు, రాజ్‌కుమార్ తదితర అధికారులకు హైదరాబాద్ నుంచి వచ్చిన టీజీపీఎస్సీ బాధ్యులు ప్రొఫెసర్ డాక్టర్ దుర్గా రావు, ప్రవీణ్‌కుమార్ సంబంధిత పరీక్ష మెటీరియల్‌ను అందించారు.

భద్రాద్రి జిల్లాలో 2222 మంది గైర్హాజరు..

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ప్రశాంతంగా ముగిసింది. నిమిషం నిబంధన కారణంగా ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో వారంతా వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎస్పీ రోహిత్‌రాజు సుజాతనగర్ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లాలో మొత్తం 21 కేంద్రాల్లో 8,875 మంది అభ్యర్థులకుగాను 2,222 మంది గైర్హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. డీఎస్‌పీ రెహమాన్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా, జిల్లాలో గ్రూప్-1 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని, హాజరుశాతం 74.95 నమోదైందని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, అబ్దుల్‌కలాం కాలేజీ సెంటర్‌లో పరీక్ష బందోబస్తు పరిశీలనకు వెళ్లిన ఎస్పీ రోహిత్‌రాజును కూడా అక్కడి సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

ఖమ్మం రూరల్లో..

ఖమ్మం రూరల్, జూన్ 9: ఖమ్మం రూరల్ మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 349 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని కేంద్రాలకు చాలా మంది విద్యార్థులు ఉదయం 9 గంటలకే చేరుకున్నారు. చంటి పిల్లలతో వచ్చిన మహిళా అభ్యర్థులకు కుటుంబ సభ్యులు సహాయకులుగా వచ్చారు. మహిళా అభ్యర్థులు పరీక్ష రాస్తున్నంతసేపు వారు ఆయా పరీక్ష కేంద్రాల బయట ఉండి చిన్నారుల సపర్యలు చూసుకున్నారు.

పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తున్న సిబ్బంది

సుజాతనగర్ అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

'ప్రజావాణి'కి హాజరుకావాలి: భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం టౌన్, జూన్ 9: ఈ నెల 10వ తేదీన సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ సకాలంలో హాజరుకావాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం చేపట్టే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐడీఓసీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేందుకు, అర్జీలు సమర్పించేందుకు వస్తారని అన్నారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ప్రమోషన్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

- వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితా
- నేడు, రేపు అభ్యంతరాలకు అవకాశం

సర్టిఫికెట్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీను

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 9: భాషా పండితులు తెలుగు, హిందీ, పీఈటీలకు సంబంధించిన ప్రమోషన్లు పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఆదివారం విద్యాశాఖాధికారులు పూర్తిచేశారు. అప్‌గ్రేడ్ అయిన టీచర్లతో పాటు ఉద్యోగోన్నతికి అర్హులైన ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఖమ్మం నగరంలోని నయాబజార్ పాఠశాల కేంద్రంగా పీఈటీలకు, ఇందిరానగర్ స్కూల్‌లో హిందీ పండిట్‌లకు, రోటరీ నగర్ స్కూల్‌లో తెలుగు పండిట్‌లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఎల్‌పీ తెలుగులో 220మందికి 219 మంది హాజరుకాగా, ఎల్‌పీ హిందీలో 212మందికి 206మంది, పీఈటీలో 120మందికి 105మంది హాజరయ్యారు. మొత్తం 530 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాగా ప్రక్రియను డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ చావా శ్రీను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది దేవేందర్, నందగోపాల్, షకీల్, కిరణ్ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితా..

అప్‌గ్రేడ్ అయిన స్కూల్స్‌కి సంబంధించిన జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదివారం విడుదల చేశారు. అప్‌గ్రేడ్ అయిన స్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్లలో అర్హులు కానివారు ఇతర స్కూల్స్‌కు బదిలీ కానున్నారు. అర్హులైన ఉపాధ్యాయులు సీనియార్టీ ప్రకారం ఆప్షన్లు ఇచ్చుకోవడం ద్వారా పాఠశాల కేటాయించబడుతుంది. దీనిలో భాగంగా ఉద్యోగోన్నతులు పొందే ఉపాధ్యాయులకు సంబంధించిన జాబితాను విద్యాశాఖాధికారులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీ, పీఈటీలు, పీడీలకు సంబంధించిన జాబితా ఉద్యోగోన్నతులతోపాటు బదిలీలకు సంబంధించిన సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు.

అభ్యంతరాలకు అవకాశం..

ఉద్యోగోన్నతుల ప్రక్రియకు అర్హులై కూడా సుమారు 22మంది ఉపాధ్యాయులు హాజరుకాలేదు. దీనిపై విద్యాశాఖ వద్ద వివరాల ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయులను గుర్తిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించి, హాజరుకాని వారిని యథాస్థానంలో కొనసాగించనున్నారు. ఉద్యోగోన్నతులకు సంబంధించిన జాబితాపై సోమవారం, మంగళవారాల్లో అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల అనంతరం జాబితాను వెలువరించి ఆప్షన్ల ద్వారా ఉద్యోగోన్నతులు కల్పించనున్నారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ పర్యవేక్షిస్తున్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 9: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అంతరాలయంలోని మూలవరులకు ఆలయ అర్చకస్వాములు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఉదయం అంతరాలయంలోని ధ్రువమూర్తులకు ప్రత్యేక అభిషేకం జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలి హరణం తదితర నిత్య పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న 107 జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గుమ్మడవల్లి ఫారెస్ట్ సెక్షన్‌లో.. 30 ఎకరాల పోడు

- నాలుగు నెలల క్రితం అడవి నరికివేత
- ఉన్నతాధికారులకు చేరిన సమాచారం
- శాఖాపరమైన చర్యలకు బీట్ ఆఫీసర్ బలి
- తప్పించుకున్న ద్వితీయ స్థాయి ఉద్యోగులు

పోడు నరికి వృక్షాలు తొలగించడంతో ప్రాభవం కోల్పోయిన గుమ్మడవల్లి అటవీక్షేత్రం

అశ్వారావుపేట, జూన్ 9: అడవుల సంరక్షణలో స్థానిక అటవీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా గిరిజనులు అడవులను నరుకుతూనే ఉన్నారు. కొత్త పోడు నరికితే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. క్షేత్ర సిబ్బంది అలసత్వం కొత్త పోడుకు ఊతమిస్తోంది. తాజాగా చోటుచేసుకున్న పోడు భూమి వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. దీంతో ద్వితీయ శ్రేణి ఉద్యోగులను కాపాడే ప్రయత్నంలో శాఖాపరమైన చర్యలకు బీట్ ఆఫీసర్ బలయ్యాడు. తనను మాత్రమే బలి చేశారంటూ బాధిత బీట్ ఆఫీసర్ పైస్థాయి అధికారులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయనున్నాడు.

మండలంలోని గుమ్మడవల్లి సెక్షన్‌లో సుమారు నాలుగు నెలల క్రితం కొందరు గిరిజనులు పోడు నరికారు. పోడు పనులు వేగంగా సాగుతుండడంతో ఫారెస్ట్ రేంజర్ మురళీ ఇటీవల క్షేత్ర సందర్శనకు వెళ్లారు. అప్పుడు కొత్తగా పోడు నరుకుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రేంజర్.. పోడు గిరిజనులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతోపాటు భూమిని స్వాధీనం చేసుకుని తిరిగి ప్లాంటేషన్ వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, పోడుకు బాధ్యులైన సిబ్బందిపై చర్యల నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. పోడు నరికిన ముగ్గురిపై కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిసింది. రేంజర్ నివేదిక ఆధారంగా విచారించిన ఉన్నతాధికారులు.. అక్కడి బీట్ ఆఫీసర్ నరసింహారావును సస్పెన్షన్ చేస్తూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై బాధిత బీట్ ఆఫీసర్ ఆందోళన వ్యక్తం చేశాడు. కేవలం తన ఒక్కడిపైనే చర్యలు తీసుకునేలా ద్వితీయ శ్రేణి అధికారులు కుట్ర చేశారని, ఇతర ఇబ్బంది పాత్రపై కనీసం రిపోర్ట్ చేయకపోవడం ఇందుకు నిదర్శనంగా అనుమానిస్తున్నాడు. ఈ విషయమై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

నాలుగు నెలల క్రితం పోడు..

నాలుగు నెలల క్రితం పోడు నరికినప్పటికీ కేవలం 10 రోజుల క్రితమే అడవి నరికినట్లు స్థానిక అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు సమాచారం. సుమారు 30 ఎకరాలకుపైగా పోడును ముగ్గురు గిరిజనులు కేవలం 10 రోజుల్లోనే నరకగలరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అటవీ విభాగంలోని కొందరిని శాఖాపరమైన చర్యల నుంచి కాపాడేందుకు ఇటీవల అడవి నరికినట్లు నివేదిక పంపించారనే వాదన వినిపిస్తోంది.

వేగంగా ప్లాంటేషన్ పనులు..

పోడు భూమిని స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు అందులో ప్లాంటేషన్ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఏటా ప్లాంటేషన్ విస్తరణ ప్రణాళికలో ఈ పోడు భూమిని కూడా చూపినట్లు తెలిసింది. పోడు భూమిలో ప్లాంటేషన్ వేసేందుకు పనులను వేగవంతం చేశారు. ప్లాంటేషన్ తర్వాత కొత్త పోడు వ్యవహారం సమసిపోతుందనే భావనతో పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

ప్లాంటేషన్ కోసం చదును చేస్తున్న పొక్లెయిన్

నివేదిక ఆధారంగా చర్యలు..

పోడు వ్యవహారంలో బాధ్యులైన అందరిపైనా చర్యలు ఉంటాయి. దశల వారీగా బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. తాను క్షేత్రస్థాయి తనిఖీకి వెళ్లినప్పుడు కొత్త పోడును గుర్తించాను. కొందరు పోడు నరుకుతున్నా బీట్ ఆఫీసర్ కనీస సమాచారం ఇవ్వలేదు. పోడు వ్యవహారంలో బీట్ ఆఫీసర్ నరసింహారావును సస్పెన్షన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్యులు జారీ చేశారు.

-మురళి, ఫారెస్ట్ రేంజర్, అశ్వారావుపేట

మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి మంజూరు

ఉత్తర్వుల కాపీని విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి

మధిర, జూన్ 9: మధిర మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు రూ.128 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆదివారం జీవోను జారీ చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన ఈ జీవో కాపీని విడుదల చేసి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా మధిర పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, దీంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తమ ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తాను ఈ నిధులను మంజూరు చేసినట్లు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. అండర్‌గ్రౌండ్ నిర్మాణం కోసం అధికారులను షెడ్యూల్ ప్రకారం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ షఫీఉల్లా, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేసిన జీవో కాపీని చూపిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

మధిరను ఆదర్శంగా తీర్చిదిద్దాలి: భట్టి

మధిర మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్థానిక నేతలు సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచించారు. 'మధిర మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలు - ప్రస్తుత సమస్యలు' అనే అంశంపై మున్సిపాలిటీ అధికారులు, పాలకవర్గ సభ్యులు, అఖిలపక్ష నేతలతో కలిసి మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు మధిర అభివృద్ధిని చూసేందుకు వచ్చేలా కృషి చేయాలని కోరారు. మధిర పట్టణానికి ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు. అభివృద్ధిని భారంగా భావించే వారిని వదిలించుకునేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, మున్సిపల్ కమిషన్ షఫీఉల్లా, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి వరకూ ఎస్సారెస్పీ నీళ్లు

- ఏడాదిలోపు అన్ని గ్రామాల్లోనూ సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- అర్హులకు త్వరలోనే రేషన్‌కార్డులు, పింఛన్లు: మంత్రి పొంగులేటి

పిండిప్రోలు గ్రామంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, జూన్ 9: ఈ వానకాలం సీజన్‌లో పాలేరు నియోజకవర్గంలో ఆయకట్టు చివరి భూములకు కూడా ఎస్సారెస్పీ నీళ్లు అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అందుకోసం ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని తిరుమలాయపాలెం, వెదుళ్లచెరువు, పిండిప్రోలు, తెట్టెలపాడు, జల్లేపల్లి, తిప్పారెడ్డిగూడెం, పాతర్లపాడు, చంద్రుతండ, గోల్‌తండా తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించిన ఆయన.. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మాట్లాడారు. ఎస్సారెస్పీ లింక్ కాల్వలను పూర్తిచేసి అన్ని గ్రామాల్లో చెరువులను నింపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏడాదిలోపు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలకు లింక్ రోడ్లు, బీటీ రోడ్లను దశల వారీగా నిర్మిస్తామని చెప్పారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులో మూడేళ్లలో అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. మొదటి దశలో అత్యంత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న మంత్రివర్గ సమావేశం అనంతరం రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం తీపికబురు అందించనున్నట్లు చెప్పారు. అర్హులకు త్వరలోనే రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని అన్నారు. అలాగే అనర్హుల పింఛన్లు తొలగిస్తామని అన్నారు. గ్రామసభల్లో భూసమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. తిరుమలాయపాలెంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను, పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులను పూర్తిచేస్తామన్నారు. పిండిప్రోలులో డిగ్రీ కళాశాల నిర్మాణ అవశాలను పరిశీలిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై పెద్ద సంఖ్యలో అందించిన వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రెండు వర్గాలు.. వేర్వేరు సభలు..

కాగా, మంత్రి పొంగులేటి పర్యటనలో కాంగ్రెస్ వర్గపోరు మళ్లీ బయటపడింది. మండలంలోని పిండిప్రోలు గ్రామంలో రెండు వర్గాలు వేర్వేరు సభలను ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీనివాసరెడ్డి కూడా ఆ రెండు వర్గాల సభలకూ హాజరయ్యారు.